క్లుప్తంగా

18న మూడు వాహనాల వేలం

సీతానగరం: మండలంలో వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు మోటారు సైకిళ్లు, ఒక ఆటోను డిప్యూటీ కమిషనర్ స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో (విశాఖ)వారి ఆదేశాల మేరకు విజయనగరం జిల్లా ఎన్ఫోర్స్‌మెంట్ సూపరెంటెండెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 18న సీతానగరం ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పీడీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వివరాల కోసం ఎస్ఈబీ స్టేషన్‌లో సంప్రదించవచ్చన్నారు.

నైపుణ్యం వెలికితీసేందుకే వేసవి శిబిరాలు



వేసవి శిబిరాలను పరిశీలిస్తున్న ఎం వాసుదేవరావు

పార్వతీపురం టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలికితీసేందుకే వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కోచ్ ఎం.వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన పట్టణంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 2వేల మంది విద్యార్థులు 50శిబిరాల్లో వివిధ రకాల క్రీడల్లో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. క్యాంపుల నిర్వహణకు ప్రభుత్వం రూ.3.50 లక్షల నిధులు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

సీతానగరం: మండలంలోని చినభోగిలి గ్రామంలో బ్రహ్మశ్రీ పోలాకి రాజా నవీన్ ఆచార్య స్వామి ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి శిలావిగ్రహం ఆవిష్కరణ మహోత్సవాలు ఈనెల 23 నుంచి మూడు రోజుల పాటు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. లక్ష్మీగణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ఉత్సవ కమిటీ సమకూర్చిన నిధులతో అభయాంజనేయ స్వామి శిలావిగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులంతా ప్రతిష్ట మహోత్సవాల్లో పాల్గొవాలని కోరుతున్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ రెన్యువల్ చేయించాలి



స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ ప్రక్రియలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జీవీఎస్ ప్రసాద్

సాలూరు: స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ చేయించుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జీవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ రెన్యువల్ ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సాలూరు ఎంవీఐ పరిధిలో గల సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల బస్సుల యాజమాన్యం ఈ సర్టిఫికెట్లు తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. ఫిట్‌నెస్‌లేని బస్సులపై ప్రభుత్వం తీసుకునే చర్యలకు యాజమాన్యం బాధ్యులు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



పట్టణంలో నిర్వహిస్తున్న ర్యాలీ

సాలూరు: దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా డెంగీ వ్యాధిని అరికట్టవచ్చని మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎం.ఈశ్వరరావు అన్నారు. ప్రపంచ డెంగీ నివారణ దినం సందర్భంగా మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డెంగీ వ్యాధి ఎలా సోకుతుంది? సోకకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం వంటి జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు.ఫ్రై డే డ్రైడే ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజీవ్, పబ్లిక్‌హెల్త్ సెక్షన్ అధికారులు, మున్సిపల్,పారిశుద్ధ్య సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కచ్చితంగా హద్దురాళ్ల ఏర్పాటు

పాలకొండ: గ్రామాల్లో సరిహద్దు రాళ్లు సక్రమంగా వేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. మండల సర్వేయర్లు, వీఆర్వోలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల వారిగా రాళ్ల ఏర్పాటుపై సమీక్షించారు. రైతుల సమక్షంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ బుచ్చయ్య ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు'

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు



గడపగడపకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ఎన్నో ఏళ్లుగా పరిషారానికి నోచుకోని సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గంగాపురం గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్న ప్రభుత్వ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. వార్డుల్లో ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో కొన్ని ప్రాంతాల్లో రోడ్డును పరిశీలించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ చేతల ప్రభుత్వం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని సీఎం ఎన్నికల హామీల్లో ఇచ్చిన నవరత్నాల వాగ్దానాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి నవరత్నాల ద్వారా ఆర్థిక చేయూత ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేసే అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్యప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. వచ్చే రెండేళ్ల కాలంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామంలో కొన్ని ప్రాంతాల్లోని రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలని వార్డువాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయగా ఎమ్మెల్యే స్పందిస్తూ మండల అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరలో రోడ్లు, కాలువలు మంచినీటి కుళాయిల ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ తిరుపతిరావు, నాయకులు మజ్జిశేఖర్, బి.కృష్ణమూర్తి, ఎంవిశ్వనాథం, వి.గురురాజు, ఎం.సత్యం నాయుడు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి

• వైఎస్సార్ క్రాంతిపథం ఏపీడీ వై.సత్యంనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ సత్యంనాయుడు

పార్వతీపురంటౌన్: చిరుధాన్యాల సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీడీ వై.సత్యంనాయుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సమీకృత వ్యవసాయంపై సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా రైతు పంటమార్పిడి చేయాలని, చిరుధాన్యాల పంటలు పండించవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పచ్చిరొట్ట ఎరువుకు సంబంధించిన విత్తనాలు సబ్సిడీ మీద అందజేస్తున్నామని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు ప్రతి ఒక్క రైతూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎఫ్‌పీఓలో ఉన్న రైతులు సమీకృత వ్యవసాయం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఎఫ్‌పీఓ ద్వారా రుణాలు తీసుకుని పెట్టుబడులు పెట్టి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. జీవామృతం వంటి సేంద్రియ ఎరువు వేసి వ్యవసాయం చేయడం వల్ల పెట్టుబడులు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీపీఎం ప్రవీణ్‌కుమార్, ఏపీ సీఎన్ఎఫ్ డీపీఎం ధనుంజయరావు, ఏపీఎంలు సురేష్, వి.మోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడవుల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మూకవలసలో పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ ఆఫీసర్ నారాయణరావు

మక్కువ: అడవుల పెంపకంతోనే, పర్యావరణాన్ని పెంపొందించుకోవచ్చునని ఫారెస్ట్ ఆఫీసర్ నారాయణరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని మూకవలస, తోటవలస గ్రామాలలో మంగళవారం లైఫ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యం ఎక్కువవడంతో, వాతావరణంలో పలు మార్పులు సంభవిస్తున్నాయన్నారు. పర్యావరణం కాపాడుకోవాలంటే, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అడవులను నాశనం చేయకుండా కాపాడుకోవాలని హితవు పలికారు. అడవుల పెంపకంతో, పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. అడవుల్లో కరక్కాయలు, కొండచీపుళ్లు, అడ్డాకులు, తేనె, చింతపండు వంటి అనేక రకాల ఔషధగుణాలు కలిగి చెట్లు ఉన్నాయని వాటిని వినియోగించుకుంటూ, భావితరాలకు కూడా ఔషధగుణాలు కలిగిన చెట్లు అందించాలంటే, అడవులు కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తం


• డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. మంగళవారం ప్రపంచ డెంగీ నివారణ దినం సందర్భంగా స్థానిక పురపాలక సంఘం కార్యాలయం నుంచి బంధం వారి వీధివరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలవల్ల డెంగీ వ్యాధి సోకుతుందని, జ్వరం, తలనొప్పి, వాంతులు, కండరాల నొప్పులు వస్తాయన్నారు. డెంగీ వ్యాధి నుంచి బయట పడడానికి వారం రోజుల సమయం పడుతుందన్నారు. ఈ వ్యాధి వల్ల ప్లేట్‌లెట్స్ తగ్గుముఖం పట్టి రక్తహీనత కలుగుతుందన్నారు. అందువల్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ వ్యాధి సోకిన వారు త్వరితగతిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో తనిఖీ చేయించుకుని వైద్యుల సూచనలు తు.చ తప్పకుండా పాటించాలని సూచించారు. అప్రమత్తతే ఆరోగ్యానికి ప్రథమ సూచిక అన్నారు. దోమలు రాకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దోమతెరల వినియోగం అలవాటుగా మారాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ ధవళ భాస్కరరావు, జిల్లా మలేరియా అధికారి శ్యామ్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవం



కల్యాణ వేదికపై భ్రమరాంబిక మల్లికార్జునస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

మక్కువ: స్థానికంగా భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం నిర్మించి, 25సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆలయ ప్రధానఅర్చకుడు, వేదపండితుడు ఆరవెల్లి విజయకుమార్‌శర్మ ఆధ్వర్యంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దశవిధ ద్రవ్యాలతో అభిషేకం, అసంఖ్యాక సహస్ర తులసీ, శతసహస్రబిల్వ దళాలతో ప్రత్యేక అర్చన చేశారు. మండలంలోని పలు గ్రామాలనుంచి వందలాది మంది భక్తులు ఆలయ వార్షికోత్సవం కార్యక్రమంలో పాల్గొని, స్వామి వార్లకు పూజలు నిర్వహించారు. బుధవారం భ్రమరాంబసమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి,భూదేవిసమేత వేంకటేశ్వరస్వామి వారికి కల్యాణమహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు.

ఘనంగా ముంగారమ్మతల్లి పండుగ



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సాలూరు: మండల కేంద్రంలోని మామిడిపల్లిలో గ్రామదేవత ముంగారమ్మతల్లి పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానికంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ఆదేశాల మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా సుమారు 120 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆర్బీకే పరిశీలన



కియోస్క్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్

సీతానగరం: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందుగానే ఎరువులు సమకూర్చనున్నామని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్ అన్నారు. ఈ మేరకు మండలంలోని అంటిపేట రైతు భరోసా కేంద్రంలో కియోస్క్ పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రంలో 2023–24 ఖరీఫ్ సీజన్‌లో ముందుగా డీఏపీ ఎరువుల నిల్వలు రైతులకు పంపిణీ చేయడానికి సిద్ధం చేశామని చెప్పారు. అలాగే పచ్చి రొట్ట ఎరువులు తయారీకి అవసరమైన విత్తనాలు అందజేయాలని నిర్ధారించామన్నారు. ఆర్బీకేల్లో ఉన్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు కావలసినన్ని గ్రామ వ్యవసాయ సహాయకులు అందజేయడానికి సమాయత్తం కావాలని ఆదేశించారు. రైతులకు ముందుగా పంపిణీ చేయాలని సూచించారు. ఆర్బీకేలకు రైతులనుంచి వచ్చిన గ్రీవెన్స్‌లు వెంటనే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డివిజనల్ వ్యవసాయ సంచాలకులు వెంకటేష్, ఏఓ ఎస్.అవినాష్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

సీతంపేట: గిరిజన గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ ప్రారంభమైంది. మండలంలోని మర్రిపాడు పీహెచ్‌సీ పరిధిలో పూతికవలస, పుత్తిగాం, రేగులగూడ గ్రామాల్లో మంగళవారం తొలిరోజు ఇళ్లల్లో స్ప్రేయింగ్ చేశారు. సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు, మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిచరణ్ పర్యవేక్షించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి స్ప్రేయింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రతీ ఒక్కరూ తమ ఇళ్లల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంటీఎస్ ఝాన్సీ పాల్గొన్నారు.

జనం కోసమే జగనన్న

• డిప్యూటీ సీఎం రాజన్నదొర



లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న డిప్యూటి సీఎం రాజన్నదొర

మెంటాడ: జనం కోసమే నిరంతరం జగనన్న ప్రభుత్వం పని చేస్తుందని ఉప ముఖ్యమంత్రి,, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని కేఎల్ వలస సచివాలయం పరిధిలో రెడ్డివానివలస, గజంగుడ్డివలస, పసుపువానివలస, చల్లవానివలస, మామిడివలస, తోటవలస, గజరాయునివలస, పాడివానివలస, సీలవలస, పుల్లేటివలస, కొండమామిడివలస, తాటిపూడివలస గ్రామాలలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ఆయన గిరిజనులకు ప్రభుత్వం నుండి అందుతున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాలకు సంభందించిన బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ గడప గడపకు ఎలాంటి ఆదరణ లభిస్తుందో అంతకు మించి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి కూడా ప్రజల నుండి మంచి ఆదరణ లభిసుదన్నారు. ప్రజలే నేరుగా ముఖ్యమంత్రికి ఫోన్ చేసి నేరుగా మాట్లాడి తమ సమస్యలకు పరిష్కార మార్గం చూసుకోవడం దేశంలో ఏ రాష్ట్రంలో లేదన్నారు. అహర్నిశలు ప్రజలు మంచి కోసమే పని చేస్తున్న జగనన్నకు ప్రతీ అవ్వా, అమ్మా, అక్కా, చెల్లి తన ఇంటి బిడ్డ వలే చూసుకుని మురిసిపోతున్నారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. జనం కోసమే జగనన్న ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రజలు చెప్పిన సమస్యలను ఉపముఖ్యమంత్రి రాజన్నదొరే స్వయంగా నోట్ చేసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా విభాగం నాయకురాలు సిరిపురం నాగమణి, సర్పంచ్ పాడి వరాలమ్మ, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, గృహ సారథులు, కన్వీనర్ కలనిమెరక త్రినాద్, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, మండల నాయకులు మయూర్ అప్పలనాయుడు, లెంక రత్నాకర్ నాయుడు, రాయిపిల్లి రామారావు, హనుమంత రాజు, బాయి అప్పారావు, కిలపర్తి మధు, మోహన్, ఎంపీడీఓ తివిక్రమ్‌తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కో ఆపరేటివ్ గొడౌన్ స్థలం ఆక్రమణ



గోదాంకు కేటాయించిన స్థలంలో మాట్లాడుతున్న కో ఆపరేటివ్ భవనం డీఈ కోటయ్య

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురం కాలనీలో నిర్మించడానికి ప్రభుత్వం సమకూర్చిన స్థలాన్ని ఇతరులు ఆక్రమించినట్లు కో ఆపరేటివ్ భవనాల శాఖ పరిశీలనలో తేలిందని ఆ శాఖ డీఈ కోటయ్య చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ లక్ష్మీపురం రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను భద్రపరచడానికి గోదాం నిర్మించడానికి జరిగిన స్థల సేకరణలో గోదాం నిర్మించడానికి నిర్వాహకులతో సోమవారం సాయంత్రం వచ్చినట్లు తెలియజేశారు. గోదాం నిర్మించడానికి రెవెన్యూ శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు తహసీల్దార్ స్థలాన్ని అప్పగించినట్లు పేర్కొన్నారు. తాజాగా స్థలాన్ని పరిశీలించగా వేరొకరు అనధికారికంగా పునాదులు వేస్తున్నట్లు గుర్తించామన్నారు. తక్షణమే అక్రమ కట్టడాన్ని తొలగించాలని తహసీల్దార్ ఎన్వీ రమణకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఆర్ఐ కరుణాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా భూమిని ఆక్రమించడం తప్పిదమేనన్నారు. ఆక్రమణలను తొలగించి రైతుల కోసం గోదాం నిర్మించడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ, పీఏసీఎస్ చైర్మన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అద్దాలబంద పరిశీలన



చెరువుగట్టు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాలకు ఆనుకుని ఉన్న చెరువులు, బందలను అభివృద్ధి చేస్తామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన జోగింపేట కాలనీని అనుకుని ఉన్న అద్దాలబందలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధిహామీ పనులతో గ్రామాలను ఆనుకుని ఉన్న చెరువులు, బందల్లో నీరు నిల్వ ఉంచడమే కాకుండా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కోసం సుందరవనంలా తయారు చేయడానికి అవసరమైన అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో మండలంలోని అన్నిగ్రామాల్లోను ఊరికో కోనేరు వంతున ఎంపిక చేసి పనులు చేస్తున్నామని తెలియజేశారు. అలాగే అన్ని గ్రామాల్లో చెరువుగట్టు అభివృద్ధి చేస్తూ ఫలజాతి, పంచాయతీకి ఆదాయం వచ్చే మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. మొక్కల పనులు ప్రజల భాగస్వామ్యంతోనే జరుగుతాయని తెలియజేశారు.

ఫ్యామిలీ డాక్టర్ శిబిరంలో 300మందికి వైద్యసేవలు



మాట్లాడుతున్న డాక్టర్ శిరీష

సీతానగరం: మండలంలోని రెడ్డివానివలసలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరంలో 300 మందికి వైద్యసేవలందించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శిరీష మాట్లాడుతూ వైరల్ జ్వరాలు సోకడానికి గల కారణాలపై మలేరియా వ్యాధి నివారణ అధికారులు గ్రామమంతా పరిశీలిస్తున్నారని చెప్పారు. గ్రామంలో జరుగుతున్న ఉచిత వైద్యశిబిరం పరిశీలించిన డాక్టర్ శిరీష వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు పార్వతీపురం మన్యం జిల్లాకేంద్రం నుంచి వచ్చిన మలేరియా నివారణ అధికారులతో కలిసి గ్రామమంతా పర్యటించి దోమలు ప్రబలడానికి గల కారణాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.సత్యం, సీపీఎం నాయకులు రమణమూర్తి ఈశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గడపగడపకు పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో మంజూరుచేసిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో ఎంపీడీఓ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు నేతృత్వంలో ఇంతవరకూ నిర్వహించిన గడప,గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనన్న సంకల్పంతో స్థానికంగా ఇంజినీరింగ్ సహాయకుల పర్యవేక్షణలో రూ.10 కోట్లకు పైగా నిధులతో పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. నిర్దేశించిన పనులను స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సూచనల మేరకు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

ఇళ్ళ నిర్మాణాలపై సమీక్ష

మండలంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు లబ్ధిదారులపై ఇంజినీరింగ్ సహాయకులు, గృహనిర్మాణ శాఖ ఇన్‌స్పెక్టర్లు ఒత్తిడి తేవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు.హౌసింగ్ ఏఈ జానకీరాం అధ్యక్షతన గృహనిర్మాణాలపై సమీక్షా సమావేశం జరిగింది.

టీకాల నిర్వహణ పక్కాగా అమలు చేయాలి



శిక్షణలో పాల్గొన్న డీఎంహెచ్ బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: వ్యాధినిరోధక టీకాల నిర్వహణ పక్కాగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల ఫార్మసిస్టులకు మంగళవారం గిరిమిత్ర సమావేశ భవనంలో జిల్లా వైద్య ఆయన అధ్యక్షతన శిక్షణ నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ వ్యాధినిరోధక టీకాల నిర్వహణ, వాటి భద్రత, రికార్డుల నిర్వహణ ప్రాధాన్యంపై ఫార్మసిస్టులు ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి సారించాలని, దీన్ని బలోపేతం చేసే దిశగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. శిక్షణను పూర్తిస్థాయిలో వినియోగించుకుని మరింత ప్రణాళికాబద్ధంగా వ్యాక్సిన్ నిర్వహణ చేయాలని సూచించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు మాట్లాడుతూ వ్యాక్సిన్ వినియోగం, వ్యాక్సిన్ నిల్వలను ఎప్పటికప్పుడు ఈవిన్ పోర్టల్‌లో నమోదు చేయాలని తద్వారా వ్యాక్సిన్ కొరత లేకుండా జాగ్రత్త పడవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ జి.వెంకటరమణ, సిబ్బంది శంకర్, యోగీశ్వరరెడ్డి పాల్గొన్నారు